ఇలాంటి సందర్భాల్లో ఈ రాస్కెల్స్ విజృంభిస్తూ వుంటారు'' అంది సునంద.

''మరేం చేద్దాం?'' బేలగా అడిగింది ప్రత్యూష.

''నీకెందుకు నువ్విటురా ముందు'' అంటూ ప్రత్యూషని ముందుకి నెట్టి తను ప్రత్యూష ప్లేస్‌లోకి వెళ్ళి నిలబడింది సునంద.

పెద్ద హీరోయిన్‌లా వెనక్కి వచ్చిన సునందని చూసి నువ్వు ఆడదానివేగా నువ్వేం చేయగలవు అన్నట్టు కాలరెగరేస్తూ వెకిలిగా నవ్వాడా వ్యక్తి. ఏం చేస్తుందో చూద్దాం అన్నట్టు వేళ్ళను పైపైకి పోనిస్తూ ఎక్కడెక్కడో తడమడం ప్రారంభించాడు.

ఆ స్పర్శ జుగుప్సాకరంగా అనిపిస్తున్నా కాసేపు మెదలకుండా తనని కానట్టు కదలకుండా నిలబడింది సునంద.

తన చేష్టలకి సునందలో ఎటువంటి వ్యతిరేకతా కనబడకపోవడంతో ఆమె చేతకానితనం వినోదభరితంగా అన్పించి మరింతగా విజృంభించడం మొదలుపెట్టాడు ఆ వ్యక్తి.

ప్రయాణీకులు ఎవరి గొడవల్లో వాళ్ళు వున్నారు. తన క్రీడ సాగిస్తూనే వున్నాడా వ్యక్తి. అతని చేతివేళ్ళు ఎక్కడెక్కడో సంచరిస్తూ నెమ్మదిగా సునంద పొట్టను చేరాయి. అంతవరకూ నిశ్శబ్దంగా అతని చర్యలను ఓ కంట కనిపెడుతున్న సునంద చటుక్కున ఆ చేతిని ఒడిసి పట్టుకుంది. అంతే.. ఆ వ్యక్తి కంఠం నుండి బాధతో కూడిన పెనుకేక వెలువడింది. బాధతో విలవిల్లాడుతూ తన చేతివేపు చూసుకున్నాడు. మణికట్టు దగ్గర నుండి రక్తం ధారగా కారుతోంది. బస్ సడన్‌బ్రేక్‌తో ఆగిపోయింది. బిగ్గరగా కేక వినపడడంతో ఏమయిందోనని ప్రయాణీకులంతా కంగారుగా వెనక్కి చూశారు. బాధగా రక్తం కారుతున్న చేతిని ఒడిసి పట్టుకుని ఆ వ్యక్తి కనబడటంతో ఏమయిందని ప్రశ్నిస్తూ బస్సులో ప్రయాణీకులంతా సీట్లలోంచి లేచి అతనివైపు రావడం ప్రారంభించారు. తనవైపు వస్తున్న ప్రయాణీకులని చూసి విషయం బయట పడిపోతుందని కంగారుపడి గభాలున ఆగిన బస్సులోంచి కిందకి ఒక్క ఉరుకు ఉరికి అటుగా పోతున్న ఆటోనాపి ఎక్కి పోనీయమన్నాడు అతను. అందరూ అయోమయంగా అతను వెళ్ళిన దిక్కు చూస్తూంటే, వాడిగా కత్తుల్లా మొనదేలిన చేతి గోళ్ళ వంక చూసుకుంటూ ముసిముసిగా నవ్వుకుంది సునంద.

**-పి.లక్ష్మి (హైదరాబాద్)**

# ఆశ

**రోజూ కంటే ఆవేళ ముందుగా లేచింది శారద. అసలు ఆ రాత్రి ఆమెకు నిద్రపడితేనా? లేస్తూనే కూనిరాగాలు తీస్తూ పనిపాటల్లో పడింది.**

రస్నా పౌడరు నీళ్ళలో కలిపి డ్రింక్ తయారుచేసి ఫ్రిజ్‌లో పెట్టింది. హాలంతా శుభ్రం చేసి సోఫాలు సర్దింది. ఫ్లవర్‌వాజ్‌లో పూలు మార్చింది. ఫిల్టరు తీసి కాఫీ కలిపింది. బద్ధకిస్తున్న భర్తను బలవంతంగా లేపి బాత్‌రూమ్‌లోకి నెట్టింది. ఆరోజు ఆమె మనసు ఎంతో ఉల్లాసంగా వుంది. ఆవేళ జనవరి ఫస్ట్. న్యూ ఇయర్ డే. మగడికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఎంతోమంది వస్తారు. ఎన్నెన్నో కానుకలు తెస్తారు. అదన్నమాట ఆమె సంబరానికంతటికీ కారణం. ఉన్నట్లుండి గత నూతన సంవత్సర వైభవం కళ్ళముందు మెదిలింది.

శారద భర్త శంకర్రావుకి పబ్లిక్ రిలేషన్ ఆఫీసరుగా ప్రమోషనొచ్చింది. సహజంగా మనిషి మంచివాడు కావడం వల్ల ఆ సంవత్సరం అతడికి న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెప్పేందుకు ఎంతోమంది వచ్చారు. వచ్చినవాళ్ళు ఉత్తచేతుల్తో రారుకదా! ఎవరికి తోచిన కానుక వారు పట్టుకొచ్చారు. నాడు శ్రీనివాసుడి కళ్యాణానికి కుబేరుడు కురిపించిన కాసుల్ని కొలిచేసరికి శోష వచ్చి పడిపోయాడట గోవిందరాజులు. మరి నేడు అసంఖ్యాకంగా భర్తకొచ్చిపడ్డ గిఫ్ట్ ప్యాకెట్లు విప్పేసరికి శారద బొంగరపు కీలు అరిగిపోయింది. డైనింగ్ సెట్టు, వాటర్ ఫిల్టరు, కుక్కరు, మిక్సీ, మినీ గ్రైండరు, కెమేరా, ఆల్బం, పెన్‌సెట్... ఇలా ఎన్నో ఎన్నెన్నో ప్రెజెంటేషన్లు కుప్పలు తెప్పలుగా వచ్చిపడ్డాయి. వాటినన్నింటిని ఏం చేసుకోవాలో తెలీక కొన్నింటిని అమ్మేసి సొమ్ము చేసుకుంది. వచ్చిన డబ్బుతో హారం



చేయించుకుంది. పోయిన ఏడు కంటే ఈ ఏడు రెట్టింపు బహుమతులు రావచ్చు. అంతే, రవ్వల నెక్లెస్ ఆమె కళ్ళముందు మెరిసింది.

ఏడు.. ఎనిమిది.. తొమ్మిది.. పది.. ఆమె మనోవేగాన్ని మించిపోయింది కాలవేగం. ఎందుకో శంకర్రావుకి గ్రీటింగ్స్ చెప్పేందుకు ఆవేళ ఒక్కరంటే ఒక్కరు రాలేదు. గంటలు గడుస్తున్నకొద్దీ ఆమె ఉత్సాహం నీరుగారిపోతోంది. ఎంత తమాయించుకుంటున్నా దుఃఖం ఆగడం లేదు. ఇంకా ఏదో ఆశ. ఆలస్యంగానైనా అభిమానులు రాకపోతారా అన్న ఆరాటం.

ఈ నిరీక్షణలో పదకొండు దాటింది. ఉదయం పడ్డ ఉడుకునీళ్ళు తప్ప ఇంకేం లేకపోవడంతో శంకర్రావు కడుపులో ఎలకలు పరిగెడుతున్నాయి.

''ఇవాళ వంట చేసే యోచనేమైనా వుందా లేదా?'' అని అడిగేసాడు మరి ఉండలేక.

''వంటకేం భాగ్యం. అరగంటలో చేసి పెడతాను. అప్పుడే ఆకలేస్తోందా ఏవిటి? ఔనూ! ఇవాళ మీకు గ్రీటింగ్స్ చెప్పేందుకు ఎవరూ రాలేదేమిటండీ'' అనుమానం నివృత్తి చేసుకునేందుకు అడిగేసింది శారద. ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళు చెమ్మగిల్లడం గమనించకపోలేదు శంకర్రావు.

''పిచ్చిదానా! నిన్న డిసెంబరు ముప్పై ఒకటిన రిటైరయిపోయాను కదే. పదవీ విరమణ చేసిన అధికారితో ఇంకేం పని ఉంటుంది? పొద్దున్నుంచి నువ్వు తెగ హైరానా పడిపోతూంటే ఎందుకో అనుకున్నాను. ఇందుకన్నమాట!'' అన్నాడు నవ్వుతూ.

''అదేవిటండి నిన్న సాయంత్రమే కదా మీరు రిటైరయ్యారు. ఇంతవరకు మీవల్ల లబ్దిపొందిన వాళ్ళంతా అప్పుడే మరచిపోతారా? ఆశ్చర్యంగా వుందే...''

''వాళ్ళు నన్ను మరచిపోవడం ఆశ్చర్యం కాదు. నువ్వు అతిగా ఆశించడమే విడ్డూరంగా వుంది. లే, లేచి భోజనం సంగతి చూడు'' ఓదార్పుగా అన్నాడు శంకర్రావు.

**-దూరి వెంకటరావు**
**(దాసన్నపేట)**